క్లుప్తంగా

శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం



రాయవరంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్త పూజ

రాయవరం: ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్త పూజలు బుధవారం రాయవరంలో నిర్వహించారు. స్థానిక పోలమ్మ తల్లి ఆలయం వద్ద, వెలంపేట రామాలయం వద్ద నిర్వహించిన రాట ముహూర్తపు పూజల్లో ఎంపీపీ నౌడు వెంకటరమణ పాల్గొన్నారు. వేద పండితులు రాట ముహూర్తపు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో ఉన్న శెట్టిబలజ సావరం వద్ద బుధవారం దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. సావరంలోని కనకదుర్గా దేవి అమ్మవారి ఆలయ సన్నిధిలో దేవి నవరాత్రులు నిర్వహించేందుకు వేదపండితులు పెద్దింటి లక్ష్మణాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాట వేశారు. ప్రతి రోజు ఆలయం వద్ద ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కాజులూరు: గొల్లపాలెం కొత్తపేట దుర్గాదేవి ఆలయం వద్ద నిర్వహించనున్న నవరాత్ర ఉత్సవాలకు బుధవారం కమిటీ సభ్యులు రాట ముహూర్తం నిర్వహించారు. ఈనెల 22 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఇందులో భాగంగా ఆలయం వద్ద ప్రధాన అర్చకులు బాదంపూడి నాగవెంకటసుబ్రహ్మణ్య ఆధ్వర్యంలో కుంకుమార్చనలు, నిప్పులగుండం, గోమాత పూజలు, జ్యోతిర్లింగార్చన, రంగవల్లి పోటీలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహక కమిటీ చైర్మన్ సనపాల ధనరాజు తెలిపారు. ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, కమిటీ సభ్యులు, అంగర శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

మసకపల్లిలో కంటి వైద్య శిబిరం

కె.గంగవరం: మండలంలోని మసకపల్లిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన జనమిత్ర అధ్యక్షుడు రవ్వా భూషణం, తదితరుల ఆధ్వర్యంలో కపిలేశ్వరపురానికి చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా చేసేందుకు కపిలేశ్వరపురంలోని ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యులు పద్మ, విజయ్ సునంద్, నగేష్, మాజీ సర్పంచ్ సొసైటీ అధ్యక్షుడు గడ్డం బన్నీ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వం సహకారంతో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం పలు గ్రామాల్లో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ లక్ష్మీమాధురి ఆధ్వర్యంలోని పశువైద్య శాఖ సిబ్బంది అచ్యుతాపురంలో 226, కాలేరులో 252 పశువులకు టీకాలను వేశారు. వైద్యులు మాట్లాడుతూ 18న వడ్లమూరు, నిడసనమెట్ట, మాచర, 19న నల్లూరు, 20న టేకి, 22న వెదురుమూడి, 23న పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, 24న అంగర, కేదారిలంక, 25న అద్దంకివారిలంకలో టీకాలను వేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు, ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు ప్రారంభించిన వైద్య కళాశాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడాన్ని అడ్డుకుందామని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండపేటలో బుధవారం పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం సహాయ కార్యదర్శి పోతుల దుర్గాప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ అబ్బిరెడ్డి వీర్రాజు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్ మాట్లాడుతూ ఈనెల 19న అమలాపురంలో నిర్వహించ తలపెట్టిన చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండపేట నియోజకవర్గం నుంచి విద్యార్థి, యువజనులు అమలాపురానికి తరలి రావాలని కోరారు. ఉదయం 9 గంటలకు అమలాపురం మండలం కామన గరువు గ్రామంలో వైద్య కళాశాలలపై వాస్తవాలను ప్రత్యక్షంగా వివరించే నిరసన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించాలని నాయకులు కోరారు.

వరద తగ్గుముఖం

పి.గన్నవరం: మండలంలోని వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతోపాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న అయోధ్యలంక, అనగర్లంక, సిర్రావారిలంక, పెదమల్లంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద తగ్గుముఖం పట్టింది.

తెగుళ్లను తట్టుకునేలా.!

- సూడోమోనాస్‌తో తెగుళ్లకు చెక్
- విత్తన శుద్ధిలో వినియోగించడం ఉత్తమం
- మొక్కల పెరుగుదలకు ఎంతో దోహదం



పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతు



సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్

రామచంద్రపురం రూరల్: మనం తినే ఆహారం నోటికి అందుతుందంటే అందులో రైతుల శ్రమ ఎంతో ఉంది. విత్తు నుంచి పంట చేతికందే వరకూ వారి కష్టం చెప్పలేనిది. ప్రధానంగా పంటల సాగులో తెగుళ్లు చుట్టేసి ఇబ్బంది పెడతాయి. పైరు ఎదుగుదలనూ ఆశిస్తాయి. అలాంటి వాటి నుంచి రక్షణకు, వరి సాగులో పలు తెగుళ్ల నివారణకు 'సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్' శిలీంధ్రని, బ్యాక్టీరియా నాశిని ఎంతో దోహదపడుతుందని రామచంద్రపురం వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. దీనిని విత్తన శుద్ధికి వినియోగించడం ద్వారా మొక్కలు ఆరోగ్యకరంగా పెరుగుతాయన్నారు. సూడోమోనాస్ ఉపయోగాలు, వినియోగించాల్సిన విధానం తదితర వివరాలను ఆయన తెలిపారు.

ఇవీ ఉపయోగాలు

- సూడోమోనాస్ బ్యాక్టీరియా నేలలో యాంటీబయాటిక్స్‌ను ఉత్పత్తి చేస్తూ, పంటలకు నష్టం కలిగించే శిలీంద్రాలను, ఇతర బ్యాక్టీరియాను నశింపజేస్తుంది. తద్వారా పంటల పెరుగుదలకు ఎంతో తోడ్పడుతుంది.
- వరి, పత్తి, వేరుశనగ, అరటి, పొగాకు ఇతర కూరగాయల పంటలపై దీనిని వాడవచ్చు.
- భూమి లోపల వరి వేర్లపైనా, ఆకులపైనా వచ్చే తెగుళ్లను నివారించడమే కాకుండా మొక్కల పెరుగుదలకు దోహదపడుతుంది.
- మొక్కల్లో వచ్చే బూజు, బ్యాక్టీరియా తెగుళ్లను అరికడుతుంది. ఇది ఉత్పత్తి చేసే కైనటిక్ అనే ఎంజైమ్ ప్రమాదకరమైన బూజు తెగుళ్లను నాశనం చేస్తుంది.
- వరిలో వచ్చే ఆకు ఎండు తెగులు, పాము పొడ తెగులు, అగ్గి తెగులు, పొట్టకుళ్లు తెగుళ్లను నివారిస్తుంది. జీవ శిలీంధ్ర నాశిని కనుక వాతావరణ కాలుష్యం కలిగించదు. భూమికి, మనుషులకు ఏవిధమైన హాని కలిగించదు. ఈ మందు కాకినాడలోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో తయారవుతుంది. అందువల్ల కేజీ మందు రూ.300లకే లభ్యమవుతుంది. దీనిపై ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తున్న కారణంగా రైతులకు కేవలం రూ.150కే మందు అందుబాటులో ఉంది. పొలంబడి రైతులకు మరో 25 శాతం అదనపు సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుంది.

మండలం	వరి పంట సాగు ఎకరాల్లో..
రామచంద్రపురం	17,963
కె.గంగవరం	15,589
కాజులూరు	19,083
కపిలేశ్వరపురం	15,763
రాయవరం	14,101
మండపేట	16,008

ఉపయోగించే పద్ధతులు

విత్తన శుద్ధి: ఒక కిలో విత్తనాలకు ఎనిమిది నుంచి పది గ్రాముల పొడి మందును పది మిల్లీ లీటర్ల నీటిలో కలిపి మిశ్రమం చేయాలి.

వేళ్లను శుద్ధి చేయుట: ఒక కిలో సూడోమోనాస్ ఫార్ములాను నిల్ల ఉంచిన నీటిలో వరి వేళ్లను ఒక గంటపాటు ఉంచి నాటితే తెగుళ్లను నివారించడమే కాకుండా మొక్క పెరుగుదలకు తోడ్పడుతుంది.

భూమిలో చల్లే విధానం

ఎకరాకు ఒక కిలో సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మందును అతిగా చీకిపోయిన సుమారు 50 కేజీల పశువుల ఎరువుతో మిశ్రమం చేయాలి. దీనిని ఒక వారంపాటు నీడలో ఉంచి కలియతిప్పాలి. మళ్లీ ఆ మిశ్రమాన్ని మరో వారంపాటు నిల్వ ఉంచి దుక్కిలో వేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. అనంతరం ఒక కేజీ సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మందును 200 లీటర్ల నీటిలో ఒక ఎకరాపై పిచికారీ చేయాలి.



మణిదీప్, వ్యవసాయ అధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కల్చరు వాడే ముందు భూమిలో తగినంత తేమ ఉండేటట్లు చూసుకోవాలి.
- ఈ మందును కంపోస్టు, ఇతర పశువుల ఎరువులు, జీవ సంబంధ పదార్థాలతో కలిపి వాడుకోవచ్చు.
- రసాయన ఎరువులు, పురుగు మందులతో కలిపి వాడకుండా ఉంటే మంచిది.
- ఈ మిశ్రమాన్ని చల్లని పొడి ప్రదేశంలో నిల్ల చేయాలి.
- తయారు చేసిన ఆరు నెలలలోపు కల్చర్‌ను వాడుకోవాలి.

మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



ద్వారపూడిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: మహిళలు తమ ఆరోగ్య రక్షణలో భాగంగా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. అంగరలో బుధవారం 'స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్' పేరుతో ప్రత్యేక ఆరోగ్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు కార్యక్రమం విధి విధానాలను వివరించారు. మహిళలకు బీపీ, సుగరు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. 'ఆరోగ్యవంతమైన మహిళలు – బలమైన కుటుంబాలు' లక్ష్యంగా అక్టోబర్ 2 వరకూ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్టు వైద్యాధికారి రత్నకుమారి తెలిపారు. 18న తాతపూడి, 19న కపిలేశ్వరపురం 2, 22న అంగర, 29న పడమర ఖండ్రిక, 30న కపిలేశ్వరపురం 1 సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలను నిర్వహిస్తామని రత్నకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎంపీటీసీ అద్దాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పుత్సల శ్రీనివాస్, కార్యదర్శి ఆర్ మోహన్, నాయకులు పాల్గొన్నారు.



అంగరలో మాట్లాడుతున్న డాక్టర్ రత్నకుమారి

ద్వారపూడిలో..

కపిలేశ్వరపురం (మండపేట): 'స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి షీర జాన్ వెస్లీ ఆధ్వర్యంలో ద్వారపూడి గ్రామ సచివాలయం వద్ద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలు, కిశోర బాలికలకు సుగరు, బీపీ క్యాన్సర్ పరీక్షలను చేశారు. కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుతామంటూ మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ విజయకుమారి, పీహెచ్ఎన్ ఉమాదేవి, హెచ్ఎస్ మోహన్‌రావు, హెచ్‌వీ మంగాయమ్మ, సామాజిక కార్యకర్త కంకటాల మురళీకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా రణభేరి

కపిలేశ్వరపురం (మండపేట): విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి పేరుతో ఐదు జాతాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ బొర్రా గోపీ మూర్తి అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా రణభేరి జాతా కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా రణభేరి జాతా బుధవారం తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోకి ప్రవేశించింది. మండపేట పట్టణం, రూరల్ మండలం, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరై జాతాకు స్వాగతం పలికారు. బైక్ ర్యాలీగా జాతా వెంబడి ప్రజా సమస్యలపై నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ గోపీ మూర్తి మండపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. తాపేశ్వరం పాఠశాలలో ఉపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు, విద్యారంగ పరిరక్షణకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. తక్షణం పీఆర్‌సీ కమిటీని నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబసు, చక్రవర్తి, ఎస్ అరుణకుమారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీ సుబ్బారావు, మండపేట మండల, పట్టణ, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.



మండపేటలో ఉపాధ్యాయుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ గోపీ మూర్తి

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆందోళన



రోడ్డుపై బైఠాయించి ఆందోళనలు చేస్తున్న అఖిలపక్షం నాయకులు

- కుయ్యేరు, గొల్లపాలెం రహదారిపై వంటావార్పు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన తహసీల్దారు, ఎస్సై
- అధికారులు, ఆందోళనకారుల మధ్య తలెత్తిన వాగ్వాదం

కాజులూరు: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుయ్యేరు, గొల్లపాలెం రహదారి నిర్మాణంపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం మండల గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొని ముందుగా కుయ్యేరు నుంచి కాజులూరు వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి కాజులూరు కృష్ణుడి గుడి వద్ద రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ, గొల్లపాలెం, కుయ్యేరుల మధ్య రూ.36 కోట్ల వ్యయంతో 13 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయంలో పనులు ప్రారంభించారన్నారు. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు ముందుకు సాగటం లేదన్నారు. ఇటీవల కురుసిన వర్షాలకు రోడ్డు మధ్యలో గోతులు ఏర్పడటంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయన్నారు. రోడ్డు దుస్థితిపై జూలై 26న ధర్నా నిర్వహించగా.. మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందిస్తూ ఆగస్టు 5 నాటికి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని అయితే అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. తహసీల్దారు రవీంద్రనాథ్, ఎస్సై మోహన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో ఆందోళనకారులు అధికారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక నాయకులు కొందరు ఇరువర్గీయులకు సర్ది చెప్పారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

రాయవరం: క్రీడాకారులు ఆటల పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఎస్‌జీఎఫ్ పోటీలు ఉపకరిస్తాయన్నారు. క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం ఎంపీపీ వెంకటరమణ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మండల స్థాయి పోటీల్లో నిర్వహించిన గేమ్స్‌లో ఖోఖో గేమ్స్‌లో సోమేశ్వరం, జెడ్పీహెచ్ఎస్ వెంటూరు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. కబడ్డీ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ వెంటూరు విద్యార్థులు జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలవగా, సీనియర్ విభాగంలో సోమేశ్వరం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. చెస్ విభాగంలో రాయవరం వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. చెస్ జూనియర్ విభాగంలో జెడ్పీహెచ్ఎస్ సోమేశ్వరం విద్యార్థులు విజయం సాధించారు. ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలు గుర్తించేందుకే శాట్ పరీక్ష

రామచంద్రపురం రూరల్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు గుర్తించి అందుకనుగుణంగా విద్యాబోధన చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ వినూత్న ప్రయోగం చేపట్టిందని సమగ్ర శిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పిల్లి రాంబాబు అన్నారు. మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం శాట్ (స్కిల్స్ ఎనాలిసిస్ టెస్ట్) పరీక్ష జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్ష–1లో 10 మార్కుల కంటే తక్కువ వచ్చిన విద్యార్థులకు శాట్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం తెలుగు, గణితం పరీక్షలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 11,628 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి 10 తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని మిగిలిన విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలను శాట్ పరీక్ష ఆధారంగా తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శాట్ పరీక్షను పరిశీలిస్తున్న పిల్లి రాంబాబు

ద్రాక్షారామ దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

రామచంద్రపురం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్ కార్యక్రమం చేపడుతున్నట్లు ద్రాక్షారామలో దస్తావేజు లేఖర్లు బుధవారం విలేకరులకు తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కార్డు, ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ జటిలమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల తీవ్ర జాప్యం అవుతుండటంతో ఇటు ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు విలువైన సమయం వృథా అవుతుందన్నారు. ఈ విధానాల్లో మార్పు అవసరమని ప్రభుత్వానికి నివేదిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 19, 20వ తేదీల్లో పెన్‌డౌన్ కార్యక్రమానికి సిద్ధమయ్యామని, కక్షిదారులు సహకరించాలని కోరారు.

అధరగొట్టిన కొబ్బరి

- లంకల నుంచి జోరుగా ఎగుమతులు
- రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు
- ఖుషీ అవుతున్న కొబ్బరి రైతులు



బి.దొడ్డవరంలో ఎగుమతి కోసం సిద్ధం చేస్తున్న కొబ్బరికాయలు

మామిడికుదురు: కొబ్బరి ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. కనీవినీ ఎరుగని రీతిలో ధరలు పెరగడంతో కొబ్బరి రైతుల్లో దరహాసం వ్యక్తమవుతోంది. వరుస పండుగల నేపథ్యంలో మామిడికుదురు మండల పరిధిలోని లంక గ్రామాల నుంచి జోరుగా కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయి. దసరా, దీపావళి తదుపరి కార్తీక మాసం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కొబ్బరికాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం వెయ్యి కొబ్బరి కాయలు రూ.27 వేలు పైబడి కొంటున్నారు. నెల రోజులు ముక్కుడు కాయలతో పాటు పచ్చి కొబ్బరి కాయలను సైతం ఇదే ధరకు కొంటున్నారు. మండలంలోని పెదపట్నంలంక గ్రామంలో కొబ్బరిలో నాణ్యమైన దిగుబడి ఉంటుందని మొదటి నుంచి నానుడి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ గ్రామంలో ఇతర గ్రామాల కన్నా రూ.200 ఎక్కువ ధరకు కొబ్బరి రాశులను కొంటున్నారు. నెల రోజుల నుంచి రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయని రైతులు చెబుతున్నారు.

కురిడీ కాయలు సైతం..

కురిడీ కాయల ధరలు సైతం పచ్చి కాయల తరహాలోనే ఉన్నాయి. లంక గ్రామాల్లో ప్రస్తుతం కురిడీ కాయలు గండేరా రూ.32 వేలు, గట గటా రూ.30 వేలుకు కొంటున్నారు. పచ్చి కొబ్బరితో పాటు కురిడీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. కొంత మంది రైతులు కొబ్బరికాయల ధరలు మరింత పెరుగుతాయన్న నమ్మకంతో రాశులను అమ్మకుండా నిల్వ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొబ్బరి ధరలు పెరగడంతో రైతులు ఖుషీగా ఉన్నారు. కొబ్బరి తోటలకు వర్షాకాలం సీజన్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. పశువుల పెంటతో పాటు ఇతర ఎరువులను కొబ్బరి తోటలకు పిచికారీ చేస్తున్నారు.

అధినేతతో ఆత్మీయ కలయిక



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గణపతి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న పీవీ

బిక్కవోలు: తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం కొంకుదురు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పడాల వీర వెంకట సత్యనారాయణరెడ్డి (పీవీ) కలిశారు. ఈ సందర్భంగా బిక్కవోలులో కొలువైన లక్ష్మీ గణపతిస్వామి చిత్రపటాన్ని అందించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రాంబాబు



జాగారపు రాంబాబు



పెట్టా సత్యనారాయణ

రామచంద్రపురం రూరల్: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కాజులూరు ఎంపీడీఓ జాగారపు రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి వృత్యంతర శిక్షణ నిమిత్తం వెళ్లడంతో ఆమె వచ్చేవరకు నెలరోజుల పాటు రాంబాబు ఎంపీడీఓగా కొనసాగనున్నారు. అదేవిధంగా డిప్యూటీ ఎంపీడీఓ సెలట్ రాజు పదోన్నతిపై పిఠాపురం ఎంపీడీఓగా వెళ్లడంతో ఆయన స్థానంలో వెలంపాలెం పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహించనున్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశం పురోగతి

కాజులూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశం పురోగతి సాధిస్తుందని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దూడల శంకర్ నారాయణ అన్నారు. మోదీ జన్మదినోత్సవ కార్యక్రమాలను బుధవారం మండల గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తలు మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి స్థానికులకు మిఠాయిలు పంచారు.

కె.గంగవరం: మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు అన్నారు. మండలంలోని కోటిపల్లిలో బుధవారం ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు అధ్యక్షతన మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా పక్వాడ్ మండల కన్వీనర్ నారాయణమూర్తి, కో–కన్వీనర్ సలాది రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు పురస్కరించుకొని హసన్‌బాద సర్పంచ్, బీజేపీ సేవా పక్వాడా మండల కన్వీనర్ నాగిరెడ్డి సతీష్‌రావు బుధవారం గ్రామంలోని సంక్షేమ బాలుర వసతి గృహం, పీహెచ్‌సీల ప్రాంగణంలో, లోపల స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత రైతులు రసాయనిక ఎరువులు వాడడం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలని రామచంద్రపురం ఏడీఏ నాగకుమార్ అన్నారు. మండలంలోని కూళ్ల, యండగండి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నానో ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు సమతుల్యంగా వడడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గి నేల సారవంతమవుతుందన్నారు. దీంతో పాటు అధిక దిగుబడి సాధించి రైతు ఆర్థికంగా ఎదుగొచ్చని సూచించారు. మండల ఏఓ సద్గురుమూర్తి మాట్లాడుతూ, ఈ నెల 30 నాటికి వరి పంట వేసిన ప్రతి రైతు ఈ–పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందొచ్చని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వర రావు, నీటి సంఘం అధ్యక్షుడు చిట్టిబాబు, వీఏఏలు భూషణం, శ్రీలక్ష్మీ రైతులు పాల్గొన్నారు.